సాక్షి నల్లగొండ

గురువారం । 4 । జూలై । 2024



రేషన్ బియ్యం పట్టివేత

డీసీఎంలో తరలిస్తున్న 15 టన్నుల రేషన్ బియ్యాన్ని నల్లగొండ పట్టణంలో పోలీసులు పట్టుకున్నారు. - 8లో



మాస్టారూ.. నిన్ను మరవలేము

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి శిల్గాపురం గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. - 10లో

గరిష్టం / కనిష్టం
36° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాల పుస్తకాలు అందించడం అభినందనీయం



పుస్తకం అందజేస్తున్న జడ్జి నాగరాజు

రామగిరి (నల్లగొండ) : కొత్త క్రిమినల్ చట్టాల పుస్తకాలను అందించడం అభినందనీయమని జడ్జి ఎం.నాగరాజు అన్నారు. హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కొత్త క్రిమినల్ చట్టాలతో ముద్రించిన పుస్తకాలను బుధవారం నల్లగొండ బార్ అసోసియేషన్ హాల్‌లో జడ్జి న్యాయవాదులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాస్కర్ తన తల్లిదండ్రులు రాపోలు లక్ష్మీ–రాములు స్మారకార్థం ఈ పుస్తకాలు ముద్రించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిరిగిరి వెంకట్‌రెడ్డి, గిరి లింగయ్య, ఎ.శంకరయ్య, ఎం.ఆదిరెడ్డి, మామిడి ప్రమీల, లాల్‌బహదూర్ పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్



బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ తదితర విద్యా సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరుతూ దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ చేపట్టామని తెలిపారు. ఈ బంద్‌కు అన్ని విద్యా సంస్థలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఇందూరు సాగర్, మల్లం మహేష్, దీరావత్ వీరానాయక్, శంకర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

నూతన సంబంధాలు ఆవిష్కరించబడాలి

నల్లగొండ : మానవ నూతన సంబంధాలు ఆవిష్కరించబడాలని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. బుధవారం నల్లగొండలో 'మార్క్స్ నేపథ్యంలో మనిషి – సమాజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ సంబంధాలు అడుగంటి పోతున్నాయని నేటి తరానికి కేవలం సాంకేతికత మాత్రమే తెలుసన్నారు. ప్రతి వ్యక్తి తనకు కావాల్సింది తక్కువగా తీసుకుని సమాజానికి ఎక్కువగా ఇవ్వాలని అప్పుడు మాత్రమే నూతన సమాజ ఆవిష్కరణ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఇటీవల పదవీవిరమణ పొందిన డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖుర్షీద్ మియా, జె.వెంకట్ రాములును సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ బొల్లారం భిక్షపతి, వేణురావు, లింగారెడ్డి, గంగాధర్, రఘుశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నల్లగొండ : ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్‌ను దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయుడిని బదిలీ రద్దు చేయడంతోపాటు సస్పెండ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య సంఘటన కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ మిర్యాలగూడ మండలం బకాల్‌వాడ జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయుడి సలీమణి పదోన్నతిపై మిర్యాలగూడ మండలం నుంచి ప్రధానోపాధ్యాయురాలిగా యాదాద్రి జిల్లా వలిగొండ మండలం అరూర్ వెళ్లింది. సదరు ఉపాధ్యాయుడు స్పౌజ్‌పై చిట్యాల మండలం జెడ్పీహెచ్‌ఎస్ గుండ్రాంపల్లికి బదిలీపై వచ్చారని తెలిపారు. మిర్యాలగూడ నుంచి పదోన్నతిపై వెళ్లే సమయంలో స్పౌజ్ తొలగించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని రాత పూర్వకంగా డీఈఓకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సదరు ఉపాధ్యాయుడి బదిలీ రద్దు చేసి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, పి.వెంకులు, ఖుర్షీద్ మియా, నర్సింహ, భాస్కర్‌గౌడ్, శంకర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, శేఖర్‌రెడ్డి, నర్సింహ, వెంకన్న పాల్గొన్నారు.

మండల, జిల్లా పరిషత్‌లలో.. ప్రత్యేక పాలన

నేటితో ముగియనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం

- మండలాకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారులే..
- నిధులు లేక అసంతృప్తితో పదవి దిగిపోతున్న సభ్యులు



శాలిగౌరారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీని సన్మానిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం గురువారంతో ముగియనుంది. శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా జెడ్పీ, మండల పరిషత్ పాలకవర్గాలు కొలువుదీరి గురువారంతో ఐదేళ్లు పూర్తి అవుతుంది. దీంతో మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వారు తమకు కేటాయించిన మండలాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది.

పనులు చేపట్టలేకపోయిన సభ్యులు

జిల్లాలో మొత్తం 31 మంది జెడ్పీటీసీలు, 31 మంది ఎంపీపీలు, 349 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఇందులో ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు గతంలోనే చనిపోయగా, మిగతావారి పదవీకాలం గురువారంతో ముగుస్తోంది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి ఆశించిన మేర నిధులు రాకపోవడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు తమ పరిధిలో పెద్దగా అభివృద్ధి పనులను చేపట్టలేకపోయారు. స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్, స్పెషల్ గ్రాంట్ కింద, 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. ఈ ఐదేళ్ల కాలంలో ఒక్కో జెడ్పీటీసీ సభ్యుడికి రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు నిధులు రాగా, ఎంపీటీసీ సభ్యుడికి కేవలం రూ.7 లక్షల వరకు మాత్రమే వచ్చాయి. ఎంపీటీసీలు తమ పరిధిలో 2 నుంచి 3 పంచాయతీలు ఉంటే, జెడ్పీటీసీ పరిధిలో మండలంలో 25 నుంచి 35 గ్రామ పంచాయతీల వరకు ఉన్నాయి. దీంతో వీరికి వచ్చిన నిధులు ఖర్చు చేసేందుకు ఏ మూలకు సరిపోని పరిస్థితి ఏర్పడింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక జెడ్పీటీసీ సభ్యుడికి ఏటా రూ.1 కోటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడంతోపాటు జనరల్ ఫండ్ కూడా వచ్చేవి. గడిచిన ఐదేళ్లలో మాత్రం ఒక్కో జెడ్పీటీసీ సభ్యుడికి రూ.1 కోటి కూడా రాలేదు.

జెడ్పీటీసీలు	31
ఎంపీపీలు	31
ఎంపీటీసీలు	349

గౌరవం దక్కకపాయే..

గ్రామ పంచాయతీల్లో తమకు ఒక కుర్చీ ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా పోరాడుతున్న ఎంపీటీసీ సభ్యుల కల నెరవేరకుండానే పదవీకాలం ముగిసిపోయింది. కనీసం ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు వస్తే అభివృద్ధి పనులను చేపట్టి ప్రజల మన్ననలను పొందాలకున్నా అదీ కుదరలేదు. ఆశించిన నిధులు రాకపోవడంతో వారంతా అసంతృప్తితోనే వెళ్లిపోవాల్సి వస్తోంది.

ఉన్నంతలో బాగానే చేశాం

ఈ ఐదేళ్ల కాలంలో ఆశించిన స్థాయిలో బడ్జెట్ రాలేదు. ఉన్నంతలో బాగానే చేయగలిగాం. ఫండ్స్ లేకపోయినా గ్రామాల్లో స్కూల్స్, డ్రెయినేజీలే, వాటర్ పైపులైన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. మన ఊరు – మన బడి రాకముందు జెడ్పీ నిధులతోనే పాఠశాలల్లో వసతులను కల్పించాం. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కనగల్, నిడమనూరు, పెద్దవూర, పీఏపల్లిలో హెల్త్ సెంటర్స్ నిర్మించాం. 180 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. 120 మందికి కారుణ్య నియామకాలు ఇవ్వగలిగాం. 50– 60 ఎకరాల్లో హరితహారం చేపట్టాం. మహిళా ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనాన్ని అన్ని వసతులతో లైబ్రరీ, స్టడీ సెంటర్‌గా అభివృద్ధి చేశాం. మధ్యాహ్న భోజనం వసతి కల్పించాం.

– బండా నరేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్

మండల ప్రత్యేక అధికారులు వీరే..

మండలం	అధికారి	హోదా
అడవిదేవులపల్లి	టి.శ్రీకాంత్	మార్కెటింగ్ అధికారి
అనుముల	కె.సత్యనారాయణ	ఏడీ బీఅండ్‌ఏహెచ్ నిడమనూరు
చందంపేట	సామేల్‌జాకబ్	మైన్స్ అండ్ జియాలజి అసిస్టెంట్ డైరెక్టర్
చండూరు	పి.రామకృష్ణ	డిస్ట్రిక్ట్ లీగల్ మెట్రాలజి అధికారి
చింతపల్లి	బి.సక్కుబాయి	చైల్డ్ వెల్ఫేర్ అధికారి
చిట్యాల	పి.శ్రవణ్‌కుమార్	డీఏఓ
దామరచర్ల	శ్యాంసుందర్	లేబర్ డిప్యూటీ కమిషనర్
దేవరకొండ	ఇందిర	వెటర్నరీ అసిస్టెంట్
డిండి	ఎం.వీరప్ప	దేవరకొండ ఏడీఏ
గుర్రంపోడు	బి.వెంకటేశ్వర్లు	సివిల్ సప్లయ్ అధికారి
కనగల్	బి.శ్రీనివాస్	యానిమల్ హజ్బెండరీ అధికారి
కట్టంగూర్	విజయేందర్‌రెడ్డి	మైనార్టీ వెల్ఫేర్ అధికారి
కేతేపల్లి	నాగేశ్వర్‌రావు	సివిల్ సప్లయ్ మేనేజర్
కొండమల్లేపల్లి	ఎస్.ద్వారక్	హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ డైరెక్టర్
మాడ్గులపల్లి	కె.మహేందర్‌కుమార్	ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్
మర్రిగూడ	డి.ఎల్లయ్య	మునుగోడు ఏడీఏ
మిర్యాలగూడ	జె.వెంకట్‌రెడ్డి	వెటర్నరీ అధికారి
మునుగోడు	కె.మురళి	డీపీఓ
నకిరేకల్	కె.కిరణ్‌కుమార్	వెటర్నరీ అధికారి
నల్లగొండ	జి.సంగీతలక్ష్మి	హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి
నాంపల్లి	కె.శ్రీనివాస్	ల్యాండ్ సర్వే రికార్డుల ఏడీ
నార్కట్‌పల్లి	బి.రమేష్	జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి
నేరడుగొమ్ము	నితిన్‌కుమార్	ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్
నిడమనూరు	బి.శ్రీనివాసరావు	నల్లగొండ వెటర్నరీ అధికారి
పీఏపల్లి	నాగమల్లేశ్వర్‌రావు	చండూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్
పెద్దవూర	వెంకటయ్య	మత్స్యశాఖ అధికారి
శాలిగౌరారం	రామరావునాయక్	నకిరేకల్ ఏడీఏ
తిప్పర్తి	దస్రూనాయక్	డీఐఈఓ
తిరుమలగిరిసాగర్	కిరణ్‌కుమార్	జిల్లా కోఆపరేటివ్ అధికారి
త్రిపురారం	బి.లీల	ఎస్‌డీసీ యూనిట్1 ఏఎంఆర్‌పీ నల్లగొండ
వేములపల్లి	బి.శ్రీనివాసరావు	జెడ్పీ డిప్యూటీ సీఈఓ

ప్రజల చెంతనే.. ప్రజావాణి

- నేటి నుంచి ప్రతి గురువారం గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహణ
- ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అర్జీల స్వీకరణ
- ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయనున్న అధికారులు



నల్లగొండ, నల్లగొండ టూటౌన్ : ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మరింత ప్రజలకు చేరువయ్యే విధంగా ఇక నుంచి మున్సిపల్ వార్డుల్లోనూ నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి నిర్ణయించారు. నేటి నుంచి ప్రతి గురువారం జిల్లాలోని 844 గ్రామ పంచాయతీలతోపాటు, నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, నందికొండ, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపల్ పట్టణాల్లోని వార్డుల్లో సంబంధిత ఉద్యోగులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఇక్కడ వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. వెంటనే పరిష్కారం అయ్యే వాటిని అక్కడికక్కడే పరిష్కరించాలని కూడా నిర్ణయించారు. అక్కడ పరిష్కారం కాని వాటిని పైస్థాయికి సిఫారసు చేయనున్నారు.

కొన్నింటికి వెంటనే పరిష్కారం..

జిల్లా కలెక్టర్‌గా నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయాలతో పాటు అన్ని మండల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం అమల్లోకి తెచ్చారు. డబ్బుల ఖర్చుతో నిమిత్తం లేకుండా వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ఉద్యోగులను అప్రమత్తం చేశారు. ప్రజలకు పాలన మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో కూడా ప్రతి గురువారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శి, ఆశ వర్కర్, అంగన్‌వాడీ టీచర్, పాఠశాల హెచ్‌ఎం తదితరులు, మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్‌తో పాటు మెప్మా ఆర్పీ, ఆశ వర్కర్, అంగన్‌వాడీ టీచర్ అర్జీలను స్వీకరించి రికార్డుల్లో నమోదు చేయనున్నారు.

66.06 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం జిల్లాలో 66.06 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వనమహోత్సవం కింద నాటిన ప్రతి మొక్కా బతకాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, రహదారులకు ఇరువైపులా తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. నిబంధనల ప్రకారమే ఇసుక సరఫరా చేయాలని అవసరమైన చోట 'మన ఇసుక వాహనం' ద్వారా మాత్రమే సరఫరా చేయాలన్నారు. గ్రామ స్థాయి బృందాలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తాగునీరు, శానిటేషన్ పరిశీలించాలన్నారు. గురువారం గ్రామస్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ ఎక్కడైనా అటవీ భూములు అన్యాక్రాంతం అవుతుంటే తమకు సమాచారం అందిస్తే అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ మొక్కలు నాటడంపై అధికారులకు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, డీఆర్డీఓ నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులపై నిర్లక్ష్యం వద్దు

హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో సంక్షేమ హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులు, కేజీబీవీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన చదువు, భోజనం అందించాల్సిన బాధ్యత హాస్టల్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఈఓ భిక్షపతి, విజయేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు పెంచాలి

నల్లగొండ : ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు పెంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వివిధ విభాగాల అధిపతులతో ఆసుపత్రి పని తీరుపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రోగులను కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలన్నారు. రోగుల కోసం ఒక సహాయ బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులను ప్రైవేట్ ఆసుపత్రికి పంపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి రోగుల వ్యాధి ముదిరిన తర్వాత చివరి క్షణాల్లో ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా అలా పంపితే సంబంధిత ప్రైవేట్ ఆస్పత్రిపై సైతం చర్యలు తీసుకుంటామన్నారు. డ్యూటీ సమయంలో ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తే ఆ డాక్టర్ పై చర్య తీసుకోవడంతో పాటు, సదరు ప్రైవేట్ ఆస్పత్రిని కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, సూపరింటెండెంట్ నిత్యానందం, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్



వేములపల్లి పీఏసీఎస్‌లో ఎరువులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

వేములపల్లి : రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) పి.శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన వేములపల్లి పీఏసీఎస్‌ను సందర్శించి రికార్డులను, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో వరి పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, యూరియాను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. వ్యవసాయాధికారుల వద్ద రైతులు తమ పంటల వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓలు రుషేంద్రమణి, సైదానాయక్, సీఈఓ రవీందర్‌రావు, ఏఈఓలు పార్వతి, నితిన్, రాజు, శేఖర్, గిరి, యాదగిరి రైతులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

త్రిపురారం : రైతు భరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయాలని సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా సహకారి అధికారి (డీసీఓ) కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి, బాబుసాయిపేట పీఏసీఎస్‌లలో రైతులతో సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న 43 పీఏసీఎస్ కేంద్రాల్లో రైతుల అభిప్రాయాలను సేకరించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీసీఓ మురళి, గోపగాని విజయభాస్కర్, గుండెబోయిన వెంకటేశ్వర్లు, సీఈఓలు గోవర్ధన్, గౌని ఉపేందర్, గోపగాని శ్రీనివాస్, గట్టు యాదగిరి, అవిరెండ్ల మట్టయ్య, గుండెబోయిన రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల్లో మాయాజాలం!

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్‌లో చేతివాటం

- చిన్న మరమ్మతులను పెద్దగా చూపుతున్న కాంట్రాక్టర్లు
- క్షేత్రస్థాయి రిపోర్ట్‌ను పట్టించుకోకుండానే బిల్లులు పాస్ చేస్తున్న అధికారులు
- లోపించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

నల్లగొండ : ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో మాయాజాలం కనిపిస్తోంది. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏ చిన్న మరమ్మతు కోసం అక్కడికి వచ్చినా మొత్తం కాలిపోయిందని లెక్కలు చూపి బిల్లులు డ్రా చేస్తున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారులు ఇచ్చిన రిపోర్టుకు.. మరమ్మతు కేంద్రంలో చెప్పిన అధికారుల లెక్కల్లో భారీ తేడాలు ఉంటున్నా.. అవేవీ అధికారులు పట్టించుకోకుండానే బిల్లులు పాస్ చేస్తున్నారని సమాచారం. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే అక్రమాలు చోటు చేసుకుంటున్నారని ఆ శాఖ ఉద్యోగులే పేర్కొనడం గమనార్హం.

ఏఈలు సర్టిఫై చేయాలి..

జిల్లాలో మొత్తం సింగిల్‌ఫేస్, త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 77,528 ఉన్నాయి. వీటి పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 2,32,363 ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మరమ్మతులు చేయించేందుకు గాను జిల్లాలో 9 కేంద్రాలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏ కారణం చేత కాలిపోయిందో ఏఈ సర్టిఫై చేసి రిపోర్టు ఇస్తారు. మరమ్మతు కేంద్రానికి ట్రాన్స్‌ఫార్మర్ రాగానే అక్కడి సిబ్బంది ఏ కారణంతో కాలిపోయింది? ఆయిల్ ఎంత ఉంది, ఎంత సమకూర్చాలి? వైడింగ్ ఉందా కాలిపోయిందా? అని పరిశీలించాలి. కానీ ఈ కేంద్రాలకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు అధికశాతం కాలిపోయాయని.. వైండింగ్ చేయడం, ఆయిల్ కూడా అంతా పోయిందని.. 100 లీటర్ల వరకు ఆయిల్ పోసినట్లుగా లెక్కలు చూపుతున్నారు.

రైతులను ఇబ్బంది పెడుతున్న సిబ్బంది

ఎక్కడైనా వ్యవసాయానికి సంబంధిచన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటిని విద్యుత్ శాఖ వాహనంలో తీసుకుని మరమ్మతు కేంద్రాలకు వెళ్లాలి. అక్కడ వెంటనే మరమ్మతులు చేసి రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరగా అమర్చాలి. కానీ ఎక్కడా ఇలా జరగడం లేదు. రైతులే సొంత వాహనాల్లో ఆయా కేంద్రాలకు ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్తున్నారు. అయినా దాన్ని వెంటనే మరమ్మతు చేసి ఇవ్వకుండా.. ఆయిల్ కొరత ఉందని, మరికొన్ని కారణాలతో రైతులను పలుమార్లు తిప్పుకుంటున్నారు.



నల్లగొండలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం

పైఅధికారుల పర్యవేక్షణ లోపం..

ట్రాక్షన్ రోలింగ్ ఎలక్ట్రికల్ సిస్టమ్ (టీఆర్‌ఈ), మీటర్ అండ్ ప్రొటక్షన్(ఎంఅండ్‌పీ) పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాలతో పాటు మీటర్ రిపేరింగ్ సెంటర్లు ఉంటాయి. కానీ ఇక్కడ మాత్రం పైఅధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పైస్థాయి అధికారులు కూడా వారానికి 2, 3 రోజులు విధులకు హాజరవుతు టూర్లకు వెళ్లినట్లుగా డైరీలో రాసుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కేవలం సెల్ కాన్ఫరెన్స్‌లతోనే నడిపిస్తున్నారని.. దీంతో కింది స్థాయిలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

లెక్కల్లో తేడాలు

ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జిల్లాలో 385 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా.. అవన్నీ కేవలం ఆయిల్ కారణంతోనే పని చేయడం లేదంటూ 5,804 లీటర్లు ఆయిల్ పోసినట్లు లెక్క చూపారు. కానీ క్షేత్రస్థాయి నుంచి మాత్రం ఆయిల్ గషింగ్ ఔట్‌తో ఒక ట్రాన్స్‌ఫార్మర్, రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీకి గురైందని, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లలో ట్యాంక్ క్రాక్‌తో ఆయిల్ లీకేజీ అయ్యిందని, 8 ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ తక్కువగా ఉందని ఆయా మండలాల ఏఈలు సర్టిఫై చేసి రిపోర్టు ఇచ్చారు. వాస్తవంగా మరమ్మతు చేస్తే క్షేత్రస్థాయిలో ఏఈ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఉండాలి. కానీ, మరమ్మతు కేంద్రం కాంట్రాక్టర్లతో సంబంధిత అధికారులు కుమ్మక్కై విద్యుత్ సంస్థకు గండి కొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ విషయంపై జిల్లా విద్యుత్ శాఖ అధికారి చంద్రమోహన్‌ను ఫోన్‌లో సంప్రదించగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలు తన దృష్టికి రాలేదని. దీనిపై విచారణ నిర్వహించిన బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ వీరబాబు

పెద్దవూర: పోయిన సెల్ ఫోన్‌ను వెతికి పట్టుకున్న పోలీసులు బుధవారం బాధితునికి అప్పగించారు. పెద్దవూర ఎస్‌ఐ పి.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దవూర మండలం చింతపల్లి గ్రామానికి చెందిన చిన పాక జానయ్య సెల్ ఫోన్ పోయిందని గత ఫిబ్రవరి 8న పెద్దవూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రాంతం వివరాలతో బాధితుడి పేరు, చిరునామా, గుర్తింపు పత్రం, ఓటీపీ కోసం ఫోన్ నంబర్‌ను ఫిర్యాదులో పొందుపర్చాలని సూచించారు. ఆయా వివరాలతో పోర్టల్‌లో నమోదు చేసిన అనంతరం పోగొట్టుకున్న ఫోన్ పనిచేయకుండా బ్లాక్ చేసి, ఎవరు వినియోగిస్తున్నారో గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) నంబర్ సహాయంతో సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి తిరిగి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పది మంది పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని రాంనగర్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న పది మందిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారినుంచి రూ.43 వేల నగదు, ఐదు బైక్‌లు, పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న గుట్కా ప్యాకెట్లు

వలిగొండ: మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న రూ.50 వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం పట్టుకుని సీజ్ చేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రంలో రాందేవ్ కిరాణం–జనరల్ స్టోర్ యజమాని చేతన్ ప్రకాష్ వివిధ కంపెనీలకు చెందిన నిషేధిత గుట్కాలను అమ్ముతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి సీజ్ చేసి స్థానిక పోలీసులకు స్వాధీన పరిచారు. షాపు యజమానిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

15 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురు వ్యక్తుల అరెస్టు



డీసీఎం నుంచి బియ్యం బస్తాలను స్టేషన్ ఆవరణలో దిగుమతి చేయిస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో బుధవారం డీసీఎంలో 15 టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రేషన్ లబ్ధిదారుల వద్ద కొందరు వ్యక్తులు కిలో రూ.9 చొప్పున కొనుగోలు చేసి మిల్లులకు అమ్ముతున్నారు. ఇదే క్రమంలో కొనుగోలు చేసి డీసీఎంలో తరలిస్తుండగా పట్టణంలోని డీఈఓ కార్యాలయ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు తెలిపారు. చైతన్యపురి కాలనీకి చెందిన డీసీఎం డ్రైవర్ భిక్షం, పానగల్లుకు చెందిన వెంకటరమణ రైస్‌మిల్లు యజమాని బండారు రాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

చాయ్, బిస్కెట్లకే పరిమితమైన పదవి

- ఐదు సంవత్సరాల పదవీకాలంపై ఓ ఎంపీటీసీ సభ్యుడి ఆవేదన

కోదాడ రూరల్: మూడు నెలలకు ఓసారి నిర్వహించే జనరల్‌బాడీ సమావేశాలకు హాజరై చాయ్, బిస్కెట్లు తీసుకోవడానికే తమ పదవులు పరిమితమయ్యాయని ఓ ఎంపీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీల పదవీకాలం పూర్తి కావడంతో బుధవారం కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూచిపూడి ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ తన ఆవేదన వెలిబుచ్చారు. ఐదేళ్ల పదవీకాలంలో ఎంపీటీసీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో ప్రజలకిచ్చిన హామీలను నెవేర్చలేకపోయాయనని బాధపడ్డారు. తన పదవీకాలం మొత్తంలో కేవలం రూ.5లక్షల నిధులు మంజూరయ్యాయని వాటితో ఏం పనులు చక్కబెట్టాలన్నారు. సర్పంచ్‌ల మాదిరిగానే తాము ప్రజలతో ఎన్నుకోబడ్డప్పటికీ తమకు ఎలాంటి నిధులు లేవని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కానీ, మండల పరిషత్ భవనంలో కానీ తమకు కనీసం కూర్చీకూడా లేదనే విషయం ఎంపీటీసీ అయ్యాకే తెలిసిందని వాపోయారు. ఇప్పటి నుంచైనా ఎంపీటీసీలకు కనీస నిధులు మంజూరు చేయాలని, సర్పంచ్‌లతో సమానంగా పంచాయతీల్లో ఓ గది కేటాయించాలని లేదంటే ఎంపీటీసీల వ్యవస్థను రద్దు చేసి డైరెక్ట్‌గా ఎంపీపీని ఎన్నుకునే విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

- ఇంజన్ ముందు భాగంలో ఇరుక్కుని ఘట్‌కేసర్ వరకు రైలు వెంటే వెళ్లిన మృతదేహం

బీబీనగర్: బీబీనగర్‌లో మంగళవారం రాత్రి రైల్వే గేటు దాటుతున్న గుర్తుతెలియని వృద్ధుడిని రైలు ఢీకొని మృతిచెందాడు. ఇంజన్ ముందు భాగంలో మృతదేహం ఇరుక్కుని అలాగే ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వరకు వెళ్లింది. రైలింజన్‌కు మృతదేహం తట్టుపడి ఉండడంతో అక్కడ గమనించిన స్థానికులు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైల్వే పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పార్లమెంట్‌లో నిరంకుశంగా వ్యవహరిస్తున్న మోదీ

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

భానుపురి (సూర్యాపేట): పార్లమెంట్ సమావేశాల్లో నీట్ పేపర్ లీకేజీ, మణిపూర్ హింస, అగ్నిపథ్, రైతాంగ సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే ప్రధాని మోదీ నిరంకుశంగా వ్యవహరించడం తగదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రజా సమస్యలపై మోదీ మాట్లాడకుండా ఎదురు దాడి చేయడంలో అర్థం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లాభాల బాటలో ఉన్న సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దానికి కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు అని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మల్లు లక్ష్మి,కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్ రావు, మట్టిపల్లి సైదులు, నగారపు పాండు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడు మృతి

చిట్యాల: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడిన భవన నిర్మాణ కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కొండాపురం మండలం సాయిపేట గ్రామానికి చెందిన దోమల మల్లికార్జున్(33) సుతారి మేస్త్రీ పనిచేస్తూ చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో పదేళ్లుగా జీవనం సాగిస్తున్నాడు. భవన నిర్మాణ పనుల్లో భాగంగా మంగళవారం వెలిమినేడులో ఓ ఇంటిపై లిప్టు సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో కార్మికుడికి తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ పద్మ

కోదాడ రూరల్: రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకే ప్రత్యేక మహాజన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు డీసీఓ పద్మ చెప్పారు. బుధవారం కోదాడ పీఏసీఎస్‌తో పాటు ఎర్రవరం, కాపుగల్లు పీఏసీఎస్‌లలో రైతులతో నిర్వహించిన ప్రత్యేక మహాజన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. గత నెల 29 నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల్లో ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే కొద్ది మంది రైతులు 5 ఎకరాల లోపు అంటే మరికొద్ది మంది 10 ఎకరాల వరకు అంటే ఇంకొందరు సాగుభూమి అంతటికీ ఇవ్వాలని కోరుకుంటున్నారని చెప్పారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు, బీడుభూములకు, గుట్టలకు ఇవ్వొద్దని చెప్పారని అన్నారు. ఎక్కువ మంది రైతులు మాత్రం 10 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు ఇవ్వాలని కోరారన్నారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇందిర, పీఏసీఎస్ చైర్మన్‌లు ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, నలజాల శ్రీనివాసరావు, నంబూరి సూర్యం, ఏఓ పాలెం రజిని, సీఈఓలు మంద వెంకటేశ్వర్లు, ఎస్‌కె.హుస్సేన్, డైరెక్టర్‌లు , రైతులు తదితరులు ఉన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

తిరుమలగిరి: మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరిలించారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి ఎస్‌ఐ సత్యనారాయణ గౌడ్ బుధవారం తమ పోలీస్ సిబ్బందితో కలిసి తిరుమలగిరి మండలం జలాల్‌పురం ఎక్స్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఓయ్య వినోద్, ఎస్.చక్రపాణి అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని సోదా చేయగా వారి వద్ద 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఇరువురిని విచారించగా తాము సేవిస్తూ తెలిసిన వ్యక్తులకు అమ్ముతున్నామని ఒప్పుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. గంజాయి అమ్ముతున్న వారి వివరాలను తమకు తెలియజేయాలని సీఐ కోరారు.

పొలం వద్ద ట్రాక్టర్ అపహరణ

బీబీనగర్: వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన బీబీనగర్ మండలం ముగ్దంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బీబీనగర్ ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్దంపల్లి గ్రామానికి చెందిన పాదం పాండు తన వ్యవసాయ బావి వద్ద పొలం దున్నడం కోసం తన సొంత ట్రాక్టర్‌ను మంగళవారం తీసుకొచ్చి పొలం వద్దే ఉంచాడు. కాగా బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ లేకపోవడంతో స్థానిక రైతులను అడిగాడు. వారు తమకు తెలియదని చెప్పడంతో ట్రాక్టర్ చోరీకి గురైందని నిర్ధారించుకున్న పాండు.. వెంటనే బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతుడు వెంకట్‌రావు

మర్రిగూడ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం మర్రిగూడ మండలం తమ్మడపల్లిలో చోటు చేసుకుంది. మర్రిగూడ ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఏఎస్ పేట మండలం జమ్మవరం గ్రామానికి చెందిన నారె వెంకట్ రావు (36) హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రావు భార్య అనిత తండ్రి నాగిళ్ల పకీరా దశదిన కర్మకు సోమవారం హాజరయ్యారు. వెంకట్‌రావు తన ఇద్దరు సడ్డకులతో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై మాల్‌కు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గ్రామంలోని మూలమలుపు వద్ద ఉన్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ దిమ్మను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్‌రావు మంగళవారం రాత్రి మృతిచెందాడు. వెంకట్‌రావు తండ్రి నారె రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రికి కూతురు తలకొరివి



తలకొరివి పెడుతున్న జోత్స్న

హుజూర్‌నగర్: ఓ కూతురు.. తండ్రికి తలకొరివి పెట్టింది. ఈ సంఘటన బుధవారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ వుదారి క్రాంతి కుమార్ (38) భార్య పార్వతితో కలిసి ఉంటున్నారు. 13 ఏళ్ల క్రితం వారికి ఒక కూతురు జోత్స్న పుట్టగానే తల్లి పార్వతి మరణించింది. దీంతో జోత్స్న నాయనమ్మ పుష్పావతి వద్ద పెరింగింది. భార్య లేకపోవడంతో క్రాంతి కుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్యానికి గురై మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు కుమారులు లేకపోవడంతో కూతురు జోత్స్న తలకొరివి పెట్టింది. ఈ సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది. కాగా జోత్స్న ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 7తరగతి చదువుతోంది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన ఆ చిన్నారిని దయాహృదయులు ఆదుకోవాలని పలురువు కోరుతున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



ఇస్మాయిల్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దోతిగూడెంలోని హెజిలో కంపెనీలో పనిచేస్తున్న వ్యక్తి మిస్సింగ్ అయినట్లు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, సురారం గ్రామానికి చెందిన ఎండీ ఇస్మాయిల్ పని నిమిత్తం గత నెల 26న మండలంలోని దోతిగూడెంలోని హెజిలో కంపెనీలో కార్మికుడిగా చేరారు. అదే కంపెనీలో పనిచేస్తున్న స్నేహితుడైన రాంచంద్రారెడ్డి గదిలో ఈనెల 1న పడుకొన్న ఎండీ ఇస్మాయిల్ అర్ధరాత్రి ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. అనంతరం ఇస్మాయిల్ కన్పించపోయేసరికి రాంచంద్రారెడ్డి అతని అన్న అజ్మేరీకి సమాచారం ఇచ్చారు. దాంతో అతను బంధువులతో పాటు తెలిసిన చోట్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో బుధవారం అజ్మేరీ తన తమ్ముడు ఇస్మాయిల్ కన్పించడంలేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్రిడ్జి పైనుంచి పడి మూడేళ్ల చిన్నారి మృతి



ఈషిత (ఫైల్)

అడ్డగూడూరు: ప్రమాదవశాత్తు బ్రిడ్జి పైనుంచి పడి మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. ఈ సంఘటన అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామంలో బుధవారం సాయంత్ర చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. చిర్రగూడూరు గ్రామానికి చెందిన మొలుగూరి శివ–ఉమారాణి దంపతుల కూతురు ఈషిత (3). బుధవారం సాయంత్రం శివ తన కూతురు ఈషితతో కలిసి బైక్‌పై గ్రామం సమీపంలోని బిక్కేరు వాగుపై ఉన్న బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో శివకు ఫోన్ రావడంతో బైక్‌ను బ్రిడ్జిపైన సైడ్‌కు స్టాండ్ వేసి గేర్‌లోనే ఉంచి మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో చిన్నారి ఈషిత బైక్ సెల్ఫ్‌ను నొక్కడంతో బైక్ ముందుకు వెళ్లి బ్రిడ్జి పైనుంచి కింద పడింది. దీంతో చిన్నారికి తీవ్రగాయాలలు కాగా, తండ్రి శివకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్సకోసం ఓ వాహనంలో తిరుమలగిరిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషయమించడంతో అక్కడ నుంచి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ నాగరాజును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



లక్ష్మమ్మ (ఫైల్)

అర్వపల్లి: సూర్యాపేట జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు, ఒక విద్యార్థి అదృశ్యమయ్యాడు. జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఓ మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన అరిగె లక్ష్మమ్మ(45) గత నెల 20వ తేదీన ఆసరా పింఛన్ కోసమని ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్లకు వెళ్లి వెతకగా ఆచూకీ లభించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మమ్మ సోదరుడు కర్కాని వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఎస్‌కె.యాకూబ్ తెలిపారు. లక్ష్మమ్మ ఆచూకీ తెలిస్తే సెల్ : 87126 86041 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

యడవెల్లిలో మరో మహిళ..



అనిత (ఫైల్)

నూతనకల్: మహిళ అదృశ్యమైన సంఘటనలో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నూతనకల్ ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం యడవెల్లికి చెందిన గాజుల అనిత గతనెల 29న ఉదయం 10గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని, బంధువులను అడగగా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె భర్త గాజుల ఉపేందర్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుడకుడలో విద్యార్థి..

చివ్వెంల: మండలంలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ పరిధిలోని పానగల్‌కు చెందిన కొడిదల మహేష్ కుడకుడ గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 2న పాఠశాల ఇంటర్వెల్ సమయంలో తన తాతకు ఫోన్ చేసి నేను హాస్టల్‌లో ఉండను అంటూ చెప్పాడు. ఇంటికి రాకుండా ఎటో వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ బి.వెంకట్‌రెడ్డి తెలిపారు.

పంటల సాగులో ఎరువుల యాజమాన్యం

- సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు
- రసాయన ఎరువులతో తగ్గనున్న భూసారం
- రైతులకు పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ సూచనలు



సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర



పత్తిచేనుకు ఎరువు వేస్తున్న రైతు (ఫైల్)

పాడి పంట

పెద్దవూర: పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే విషయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ పేర్కొంటున్నారు. ఎరువుల యాజమాన్యానికి సంబంధించి రైతులు పాటించాల్సిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

రసాయన ఎరువులతో నష్టం..

రసాయన ఎరువుల వాడకం శ్రేయస్కరం కాదు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారం తగ్గుతుంది. మరోవైపు పంట ఉత్పత్తులలో రసాయన అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డిమాండ్ తగ్గి ధరలు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. విరివిగా, విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం తగ్గించాలి. వీటి వాడకం వలన క్రమేపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.

సేంద్రియ ఎరువులే మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. నేలకు సేంద్రియ పదార్థాలు జీవం వంటివి. సేంద్రియ ఎరువుల వల్ల అన్ని రకాల పంటలకు పోషకాలు అందుతాయి. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. ఆ దిశగా రైతులు ఆలోచిస్తే నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చు. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.

ఎరువుల ధరలపై అవగాహన అవసరం..

ఎరువుల వాడకం ఎంత ముఖ్యమో.. వాటి ధరలపై అవగాహన కలిగి ఉండడం కూడా అంతే ముఖ్యం. ఏయే ఎరువుల్లో ఏ శాతం ఎంత ఉంటుంది. నాణ్యత, ధరలు, నకిలీలు వంటి వాటిని గమనించాలి. దీనికి వ్యవసాయ అధికారులు, అవగాహన ఉన్న రైతుల సలహాలు తీసుకోవాలి. పోషకాలను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు చేయాలి. ప్రతి ఎరువు బస్తా మీద దానిలో ఉన్న పోషక విలువల శాతం స్పష్టంగా ఉంటుంది, అయితే సూచించిన దానికంటే పోషక విలువలు సగం శాతం మాత్రమే ఉంటాయనే విషయాన్ని గమనించాలి.

ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులు..

- లోతు దుక్కుల వల్ల భూమి పొరలు గుల్లబారి తేమను బాగా నిల్వ ఉంచుకుంటాయి. వేసిన ఎరువును ఎక్కువ శాతం మొక్కలు తీసుకుంటాయి.
- పంటలో ఉన్న కలుపును పూర్తిగా తొలగించిన అనంతరం తేమ ఉన్న దశలోనే ఎరువులు చల్లుకోవాలి.
- సమస్యాత్మక భూముల్లో ముందుగా ఉన్న సమస్యను సరిచేసుకుని ఆ తర్వాత ఎరువులు వేసుకుంటే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.
- అన్ని పోషకాల్లో నత్రజని పోషకం వృథా ఎక్కువగా ఉంటుంది. యూరియాను వేప పిండితో కలిపిగానీ, యూరియా ఎరువుతో వేప నూనె కలుపుకుని వాడితే నత్రజని నెమ్మదిగా విడుదలవుతూ వృథా తగ్గుతుంది.
- కోల్‌థార్‌తో 2 లీటర్ల కిరోసిన్‌తో మిశ్రమం చేసి రెండు బస్తాల యూరియాలో కలిపితే మంచి ఫలితాలు వస్తాయి. అర బస్తా యూరియాను ఒక బస్తా తడి, పొడి మట్టితో కలిపి 24 గంటలు నీడలో ఉంచి ఆ తర్వాత నేలకు అందిస్తే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

ఏ దశలో, ఏ సమయంలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి. నత్రజనిని యూరియా రూపంలో వాడే సమయంలో వృథాని అరికట్టడానికి పైన చెప్పిన మిశ్రమాలను ఉపయోగించాలి. భాస్వరం ఎరువును మొత్తం మోతాదును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచటంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.

వెదజల్లే పద్ధతి..

సరైన పద్ధతిలో ఎరువులు వేయడం చాలా ముఖ్యం. సాధారణంగా ఎరువులను రెండు పద్ధతుల్లో వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో మొక్కలు దగ్గర దగ్గరగా ఉంటే మేలు జరుగుతుంది. వరుస క్రమంలో లేని మొక్కలకు, వేళ్ల భూమిలో అల్లుకుపోయే పైర్లకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. వరికి కూడా ఈ పద్ధతి చాలా మేలు చేస్తుంది.

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరువులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.